మాటలు తప్ప చేతలేవీ...

● అభ్యర్థుల ఎంపికలో మహిళా రిజర్వేషన్లు ఎక్కడ?



చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలకు ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించి ప్రచారం ప్రారంభించాయి. అయితే ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో మహిళలకు తగిన రిజర్వేషన్లు పాటించాయా అని ప్రశ్నిస్తే లేదనే సమాధానమే వస్తోంది. సినీ దర్శకుడు సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి మాత్రమే 40 మంది అభ్యర్థులకుగాను 20 మంది మహిళలను పోటీకి దింపి మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది. ఎన్డీయే కూటమి మిత్రపక్షమైన పీఎంకేకు 10 సీట్లు కేటాయించగా మూడు నియోజకవర్గాల్లో మహిళా అభ్యర్థులను రంగంలోకి దింపింది. ఈ విషయం గురించి పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ మాట్లాడుతూ... తమ పార్టీ అభ్యర్థుల ఎంపికలో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు పాటించిందని ప్రకటించుకున్నారు. ఇక 19 నియోజకవర్గాల్లో నేరుగా పోటీ చేస్తున్న బీజేపీ, 21 నియోజకవర్గాలలో పోటీ చేసిన డీఎంకే తలా ముగ్గురు చొప్పున మహిళలను బరిలోకి దింపాయి. 32 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఒక మహిళా అభ్యర్థిని మాత్రమే ఎంపిక చేసింది. ఇదే విధంగా పుదుచ్చేరితో పాటు 10 స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇద్దరు మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది. ఈ మూడు కూటముల్లో ఇతర పార్టీలు మహిళా అభ్యర్థులను పోటీకి దింపలేదు. మొత్తంమీద ఎన్డీయే నుంచి ఆరుగురు, ఇండియా కూటమి నుంచి ఐదుగురు మహిళా అభ్యర్థులే పోటీ చేస్తున్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించేందుకు ఆరాటపడుతున్న ఎన్డీయే గానీ, ఇండియా కూటమి గానీ ఈ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఆసక్తి చూపకపోవడం గమనార్హం.



నగరంలో వాహనాల తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రాష్ట్రంపై తీవ్రవాదుల దాడులు

● హెచ్చరించిన కేంద్ర ఇంటెలిజెన్స్

అడయార్, మార్చి 27: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఇదే అదనుగా భావించి తీవ్రవాదులు దాడులకు తెగబడవచ్చని కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మొత్తం ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలతో పుదుచ్చేరిలోని ఒక్క స్థానానికి ఏప్రిల్ 19న అంటే తొలి దశలోనే ఎన్నికల పోలింగ్ జరగనుంది. అయితే, ఈ ఎన్నికల కోసం జరిగే ప్రచార సమయంలో తీవ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కూడా హెచ్చరించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల బెంగళూరు నగరంలోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడుకు సూత్రధారిని జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. ఇస్లామిక్ స్టేట్ సంస్థ ఐసిస్‌కు చెందిన ఈ ఉగ్రవాది ఈ పేలుడుకు ముందు స్థానిక ట్రిప్లికేణిలోని లాడ్జీలలో నెల రోజుల పాటు బస చేసినట్టు గుర్తించారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుపెట్టుకుని ఐసిస్ తీవ్రవాదులు ఈ దాడులకు పాల్పడవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. అంతేకాకుండా, శాంతిభద్రతలను కట్టుదిట్టం చేస్తే, రద్దీ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘాను పటిష్ఠం చేయాలని సూచించింది. దీంతో రాష్ట్ర పోలీస్ శాఖ మరింత అప్రమత్తమైంది. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను తీవ్రతరం చేసింది.

ఈపీఎస్ వర్గానికే రెండాకులు



మళ్లీ తేల్చి చెప్పిన ఎన్నికల సంఘం



చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నాయకత్వంలో అన్నాడీఎంకే రెండాకుల గుర్తు పైనే పోటీ చేస్తారని కేంద్ర ఎన్నికల సంఘం మరోమారు స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు రెండాకుల గుర్తుపై పోటీ చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని కూడా పేర్కొంది. రెండాకుల గుర్తును స్తంభింపజేయాలని అన్నాడీఎంకే నాయకుడు వి. పుగళేంది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సచినదత్తాతో కూడిన ధర్మాసనం ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా వెళ్ళి తన అభ్యంతరాలు తెలుపుకోవాలని ఆదేశించింది. పార్టీ నియమ నిబంధనల ప్రకారం ఏ వర్గానికి రెండాకుల గుర్తు చెందుతుంతో తెలుసుకోమంటూ పేర్కొంది. ఆ మేరకు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల గడువు ముగియనుండటంతో మంగళవారం ఉదయం పుగళేంది ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్ళి సంబంధిత ఎన్నికల అధికారిని కలుసుకుని రెండాకుల గుర్తును ఏ వర్గమూ ఉపయోగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పుగళేంది ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ఉదయం ఓ ఉత్తర్వు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్ నాయకత్వంలోని అన్నాడీఎంకే అభ్యర్థులు రెండాకుల గుర్తుపై పోటీ చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆ ఉత్తర్వులో స్పష్టం చేసింది. తమ వద్దనున్న దస్తావేజులు, అన్నాడీఎంకే సర్వసభ్యమండలి, కార్యాచరణ మండలి, సభ్యుల వివరాలు, వారి ప్రతిపాదనలన్నింటినీ పరిశీలించిన మీదటే రెండాకుల గుర్తు ఈపీఎస్ వర్గానికి చెందుతుందని పేర్కొంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఈపీఎస్‌ను కూడా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిందని, ఇలాంటి పరిస్థితులలో రెండాకుల గుర్తును స్తంభింపజేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. అంతే కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులందరూ రెండాకుల గుర్తుపై పోటీ చేసేలా ఆ గుర్తును కేటాయించనున్నామని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా ఉత్తర్వుతో రాష్ట్రంలో అన్నాడీఎంకే శ్రేణుల ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయింది. రెండాకుల గుర్తును స్తంభింపజేయాలన్న ప్రత్యర్థుల కుట్ర కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుతో భగ్నమైందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పదవిలో ఉన్నా... అందుకే ప్రచారం చేయలేకున్నా!

● నటి ఖుష్బూ



చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పదవిలో ఉండటం వల్లే తాను ఎన్డీయేకు మద్దతుగా బీజేపీ అభ్యర్థులతో కలిసి ప్రచారం చేయలేని పరిస్థితిలో ఉన్నానని ఆ పార్టీ జాతీయకమిటీ సభ్యురాలు, ప్రముఖ సినీ నటి ఖుష్బూ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖుష్బూకు పార్టీ టిక్కెట్ లభించకపోవడం వల్లే ఆమె ప్రచారానికి దూరంగా ఉంటున్నారని ఇటీవల ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల సమయంలోనూ తన గురించి వదంతులు వ్యాపించడం ఆనవాయితీగా మారిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి తాను ప్రయత్నించలేదని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నానని తెలిపారు. ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా ప్రభుత్వ పదవిలో ఉన్నానని, కనుకనే తాను ప్రచారానికి దూరంగా ఉంటున్నానని, అదే సమయంలో బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు

రామనాథపురంలో 6కు పెరిగిన ఓపీఎస్ ప్రత్యర్థులు

ప్యారీస్, మార్చి 27: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం పోటీచేయనున్న రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో ఓపీఎస్ పేరుతో నామినేషన్ పత్రాలు సమర్పించిన వారి సంఖ్య ఆరుకు చేరుకుంది. అన్నాడీఎంకే అసమ్మతి నాయకుడు ఓపీఎస్‌కు ఈ సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే ఎన్నికల గుర్తు రెండాకులు దూరం కావడంతో, ఆయన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమితో జతకట్టారు. ఆయనకు కేటాయించిన రామనాథపురం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ గుర్తుతో పోటీ చేయనున్న నేపథ్యంలో, ఓపీఎస్ పేరుతో ఆరుగురు ఇండిపెండెంట్లుగా ఎన్నికల బరిలో నిలిచారు. దీంతో ఓపీఎస్ పేరుతో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లైంది. ఈ పరిణామంపై ఓపీఎస్ సహా ఆయన మద్దతుదారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విరుదునగర్‌లో...: విరుదునగర్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున సినీనటి రాధిక తన నామినేషన్ పత్రాలు సమర్పించి కమలం గుర్తుతో ప్రచారం కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో, పార్టీ కోసం కష్టపడిన తమలాంటి నిర్వాహకులను పక్కన బెట్టి నియోజకవర్గంతో ఎలాంటి సంబంధాలు లేని రాధికను అభ్యర్థిగా నిలపడం సరికాదంటూ బీజేపీ కార్యకర్త వేద విరుదునగర్‌లో పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదే విధంగా, తిరునెల్వేలి నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్‌కు వ్యతిరేకంగా మాజీ ఎంపీ రామసుబ్బు, జిల్లా కార్యదర్శి వనమామలై నామినేషన్ దాఖలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు

● ఇప్పటివరకు రూ.70 కోట్ల విలువైన నగలు, నగదు స్వాధీనం

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు

ప్యారీస్, మార్చి 27: రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాల్లో వాహనాల తనిఖీ ప్రక్రియను వేగవంతం చేశామని, ఇప్పటివరకు రూ.70 కోట్ల విలువైన నగదు, నగలను ఫ్లయింగ్‌స్క్వాడ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు ప్రకటించారు. రాష్ట్రంలో ఏప్రిల్ 19న ఒకేవిడతలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సత్యప్రదసాహు బుధవారం మీడియా ప్రతినిధులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు జాబితాను సవరించిన అనంతరం ప్రస్తుతం 6,23,26,901 ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 3,06,02,637 మంది, మహిళలు 3,17,16,065 మంది, ఇతరులు 8,465 మంది ఉన్నట్లు తెలిపారు. 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో గతంలో 68,147 పోలింగ్ కేంద్రాలు ఉండేవని, ఓటర్ల సౌకర్యార్థం అదనంగా మరో 177 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో, పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, ఓటర్లకు తాగునీరు తదితర సదుపాయాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే అక్కడ పటిష్ఠ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు 6,13,991 మంది ఉన్నారని, వీరిలో పోస్టల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోదలచుకున్న వారు ముందుగానే ఆయా ప్రాంతాల్లో ఉన్న ఎన్నికల కార్యాలయాలను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సుమారు 7 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో పాల్గొంటారని, వారికి పోలింగ్‌కు సంబంధించిన తొలివిడత శిక్షణ పూర్తి చేశామన్నారు. మరో రెండు విడతల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేలా వారికి నగదు, బహుమతులు పంపిణీ చేయకుండా అడ్డుకొనేందుకు, ఎన్నికల పనులు పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీరిలో ఎన్నికల ఖర్చు పర్యవేక్షకులు 58 మంది, పోలీసు శాఖ పర్యవేక్షకులు 20 మందిని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.70 కోట్ల నగలు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో నగదు రూ.33 కోట్లు కాగా, మిగతావి నగలని ఆయన వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, వీడియో, ఫొటోలు కూడా పంపించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు గోప్యంగా ఉంచుతామని, టెలిఫోన్ ద్వారా ఫిర్యాదు చేయదలచిన వారు 1950 అనే నెంబరులో ఎన్నికల కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ పంపిణీ చేసిన ఓటరు గుర్తింపుకార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, ప్రస్తుతం కొత్త గుర్తింపుకార్డులను 17.53 లక్షల మందికి అందించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న మరో 7 లక్షల మందికి పంపిణీ చేస్తామన్నారు. ఓటరు గుర్తింపుకార్డు లేకపోయినా ఎన్నికల కమిషన్ ప్రకటించిన 12 రకాల దస్తావేజులు చూపించి ఓటేయవచ్చని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీలకు వారి వారి ఎన్నికల చిహ్నాలను కేటాయించిందని, ఇండిపెండెంట్ అభ్యర్థులకు జనరల్ కేటగిరి చిహ్నాలు కేటాయించిందని, ఆ జాబితాలో బొంగరం గుర్తు లేదని సత్యప్రదసాహు వివరించారు.

మహిళలకు ప్రతినెలా రూ.3000

3లక్షల మందికి ఉద్యోగావకాశం ● మద్య నిషేధ చట్టం అమలు ● పుదుచ్చేరికి రాష్ట్ర హోదా



ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి రాందాస్ తదితరులు

- కడలూరు జిల్లాలో మూడు చోట్ల నేల బొగ్గు తవ్వకాలపై నిషేధం
- గోదావరి - కావేరి నదుల అనుసంధానం
- గర్భిణులకు ప్రసూతి సాయం రూ.20 వేలు
- సీనియర్ సిటిజన్లకు ప్రతినెలా రూ.3 వేల పింఛన్
- ఆడపిల్లల విద్యావసరాలకు రూ.10లక్షల డిపాజిట్
- ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ పథకం అమలు
- చెన్నైలో రూ.1000కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు
- నీట్ నుండి రాష్ట్రానికి మినహాయింపు
- పొగాకు వస్తువులపై 100 శాతం పన్ను విధింపు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలందరికీ ప్రతినెలా రూ.3వేలు చెల్లింపు, యేటా మూడు లక్షల మంది నిరుద్యోగ యువకులు ఉపాధి అవకాశాలు, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా అంటూ పాట్టాలి మక్కల్ కట్చి తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. నగరంలోని పీఎంకే కార్యాలయంలో బుధవారం పీఎంకే ఎన్నికల మేనిఫెస్టోను ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ విడుదల చేశారు. కులాలవారీ జనగణనను నిర్వహించి ఆయా కులాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని, ప్రైవేటు సంస్థలు, కర్మాగారాల్లో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, 60 యేళ్లు దాటిన రైతుకు ప్రతినెలా రూ.3వేల పింఛను అందిస్తామని పేర్కొన్నారు.

- జాతీయ బ్యాంకుల్లో రూ.లక్ష దాకా పొందిన పంట రుణం మాఫీ
- రేషన్ షాపుల్లో పామాయిల్‌కు బదులుగా వేరుశనగ నూనె, కొబ్బరి నూనె

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

1403 మంది అభ్యర్థులు 1749 నామినేషన్ల దాఖలు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం బుధవారం మధ్యాహ్నం ముగిసింది. చివరి రోజున ప్రధాన పార్టీల అభ్యర్థుల కంటే స్వతంత్ర అభ్యర్థులే అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. సెంట్రల్ చెన్నైలో డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్, కోయంబత్తూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, తేనిలో అమ్మామక్కల్ మున్నేట్ర కళగం అధినేత టీటీవీ దినకరన్ నామినేషన్లు దాఖలు చేశారు. పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే ఈ నెల 20న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ నాలుగు రోజులపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులే వరుసగా నామినేషన్లు వేశారు. ఈ నెల 25న పంగుణి ఉత్తిరానికి పౌర్ణమి కూడా తోడు కావటంతో ఆ శుభముహూర్త సమయాన నామినేషన్లు వేస్తే గెలుపు తథ్యమని డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటమి అభ్యర్థులంతా నామినేషన్ల దాఖలుకు బారులు తీరారు. ఆ రోజు అన్నాడీఎంకే తరఫున పోటీ చేసే 33 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇదే విధంగా డీఎంకే, బీజేపీ అభ్యర్థులు 80 శాతం అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఈనెల 26న డీఎంకే, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 780 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 1403 మంది 1749 నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. గురువారం ఉదయం నుంచి నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్లలో పొందుపరచిన వివరాలలో ఏవైనా అనుమానాస్పదంగా ఉంటే అభ్యర్థులను పిలిపించుకుని రిటర్నింగ్ ఆఫీసర్లు విచారణ చేపడుతారు. నామినేషన్లతోపాటు జత చేసిన దస్తావేజులు, ఆస్తుల వివరాల పట్టిక అన్నీ సవ్యంగా ఉన్నాయా అని అధికారులు పరిశీలిస్తారు. ఈ నెల 30న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. ఆ రోజు మధ్యాహ్నం లోగా నామినేషన్లు ఉపసంహరించుకున్న తర్వాత పోటీలో మిగిలే అభ్యర్థుల తుది జాబితాను అదే రోజు సాయంత్రం లోగా రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు.







నామినేషన్ దాఖలు చేస్తున్న సెంట్రల్ చెన్నై నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్ - కోవైలో నామినేషన్ దాఖలు చేస్తున్న అన్నామలై - తేనిలో నామినేషన్ సమర్పిస్తున్న ఏఎంఎంకే అభ్యర్థి దినకరన్

రంజాన్ వేళలు

గురువారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27

శుక్రవారం : సహర్ : ఉదయం - 4.26



మత రాజకీయాలు చేసేది బీజేపీనే

హిందూ దేశంలో హిందువులకు భద్రత లేదా? ● కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ప్రశ్న

అడయార్, మార్చి 27: దేశంలో మతవాద రాజకీయాలు చేసేది ఒక్క భారతీయ జనతా పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మాత్రమేనని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆరోపించారు. ఆయన కారైక్కుడిలో విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో 80 శాతం ప్రజలు హిందువులన్నారు. ఈ విషయాన్ని క్రైస్తవులు, ముస్లింలు అంగీకరించారన్నారు. హిందువుల జనాభా 80 శాతం మేరకు ఉన్న భారత్‌లో వారికి మేం రక్షణ కల్పిస్తామని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. 80 శాతం హిందూ ప్రజలు ఉన్న దేశంలో హిందూ ఆలయాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయన్నారు. ఇలాంటి దేశంలో హిందువులకు రక్షణ కల్పిస్తామంటూ బీజేపీ నేతలు ఊకదంపుడు ప్రచారం చేయడం వారికే చెల్లిందన్నారు. దేశంలో 140 కోట్ల జనాభాలో 70 శాతం ప్రజల ఆస్తి విలువ కేవలం 3 శాతం మాత్రమేనన్నారు. మిగిలిన ఆస్తి 70 కోట్ల మంది ప్రజలదన్నారు. ఇందులో 10 శాతం మంది విలువ 50 శాతమన్నారు. ఇది ఏ విధంగా సామాజిక న్యాయం కిందకు వస్తుందన్నారు. దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందుతోందన్నారు. దేశ ప్రగతి ఫలాలు కూడా అన్ని వర్గాలకు చేరాలన్నారు. గత యూపీఏ ప్రభుత్వం 24 కోట్ల మంది పేదలను పేదరికం నుంచి గట్టెక్కించామన్నారు. ఆ తర్వాత ప్రధాని మోదీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు.

సమాచార ధ్వని

పెరిగిన ఏసీ రైళ్ల రిజర్వేషన్

ఐసిఎఫ్, మార్చి 27: ఎండ తీవ్రత కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ కోచుల్లో ప్రయాణించేందుకు చేసుకుంటున్న రిజర్వేషన్లు 20 శాతం పెరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో వేసవి సెలవులను పురస్కరించుకొని సొంతూళ్లు, పర్యాటక స్థలాలకు ప్రజలు వెళుతుంటారు. వారి సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు అనుసంధానం చేయడం వంటి చర్యలను రైల్వే శాఖ చేపడుతోంది. ఈక్రమంలో ప్రయాణికులు ఏసీ సీట్లను బుక్ చేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

పోస్టుల భర్తీకి అనుమతి కోరిన ఈబీ

ఐసిఎఫ్, మార్చి 27: ఖాళీగా ఉన్న 8,400 పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వ అనుమతిని విద్యుత్ బోర్డు కోరింది. విద్యుత్ బోర్డులో సహాయ ఇంజనీర్లు, మీటరు రీడింగ్ చూసేవారు, సహాయకులు, ఇతర సిబ్బంది అని మొత్తం 39,961 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది 8,400 పోస్టుల భర్తీకి అనుమతివ్వాలని కోరుతూ విద్యుత్ బోర్డు ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎడ్లబండ్ల పందేలు నిలిపివేత

ఐసిఎఫ్, మార్చి 27: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల పందేలను పోలీసులు అడ్డుకున్నారు. పుదుకోట జిల్లా అలంగుడి సమీపంలోని వంబన్ వీర మహాకాళియమ్మన్ ఆలయ పంగుణి ఉత్సవాలను పురస్కరించుకొని ఎడ్ల బండ్లు, గుర్రపు బండ్ల పోటీలు మంగళవారం జరిగాయి. ఈ కారణంగా టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న జిల్లా నిర్వాహక అధికారులు, పోలీసులు... పందేలను అడ్డుకున్నారు.

చెన్నైలో జంబో సర్కస్

ఐసిఎఫ్, మార్చి 27: జంబో సర్కస్ బృందం నగరంలో రెండు ప్రాంతాల్లో సర్కస్‌లు నిర్వహిస్తున్నాయి. నందనం వైఎంసీఏ మైదానం, తిరువాన్మియూర్ సమీపంలోకి కొట్టివాక్కం (ఓఎంఆర్ రోడ్డు)లో సాయంత్రం 4.30, రాత్రి 7.30 అని రెండు ప్రదర్శనలు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1.30, సాయంత్రం 4.30, రాత్రి 7.30 గంటలని మూడు షోలు ప్రదర్శిస్తున్నారు. టిక్కెట్టు ధరలు రూ.150, రూ.250, రూ.350, రూ.450గా ఉన్నాయి. వివరాలకు నెం.8667013077లో సంప్రదించవచ్చు.

రైళ్ల సేవల్లో మార్పులు

ఐసిఎఫ్, మార్చి 27: రైలు మార్గాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు కారణంగా స్థానిక సెంట్రల్ - గుమ్మిడిపూండి మార్గంలో ఆరు సబర్బన్ రైళ్ల సేవల్లో మార్పులు చేపట్టినట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. పొన్నేరి - మీంజూరు రైల్వేస్టేషన్ల మధ్య గురువారం నుంచి 31వ తేది వరకు ఉదయం 10 నుంచి 11.45 గంటల వరకు ఈ పనులు జరుగనున్నాయి. ఈ కారణంగా సెంట్రల్ - గుమ్మిడిపూండి ఉదయం 9, 10.35 గంటల రైళ్లు మీంజూరు వరకు మాత్రమే నడువనున్నాయి. చెన్నై బీచ్ - గుమ్మిడిపూండి ఉదయం 9.40 గంటల రైలు ఎన్నూర్ వరకు మాత్రమే నడువనుంది. గుమ్మిడిపూండి - సెంట్రల్ ఉదయం 9.55 గంటల రైలు మీంజూరు నుంచి నడుస్తుంది. గుమ్మిడిపూండి - బీచ్ ఉదయం 10.55 గంటల రైలు మీంజూరు నుంచి బయల్దేరనుంది. సూళ్లూరుపేట - సెంట్రల్ ఉదయం 10 గంటల రైలు ఎన్నూర్ నుంచి నడవనుంది.

'గ్రూప్-2' అభ్యర్థుల జాబితా విడుదల

ఐసిఎఫ్, మార్చి 27: గ్రూప్-2 మూడో విడత ఇంటర్వ్యూ తాత్కాలిక అభ్యర్థుల జాబితా టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. గత ఏడాది ఫిబ్రవరి 25వ తేది గ్రూప్-2 (ఇంటర్వ్యూ పోస్టులు) పరీక్ష జరిగింది. ఈ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఎన్‌పీఎస్సీ తన వెబ్‌సైట్‌లో విడుదల చేసింది.

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 27: చెన్నై మెట్రో రైలు సంస్థలో ఖాళీగా ఉన్న సహాయ మేనేజర్ పోస్టులకు అర్హులైన వారు ఏప్రిల్ 6వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, క్వాంటిటీ సర్వేయర్, ప్లానింగ్, సివిల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు బీఈ, బీటెక్, బీఆర్క్ చేసిన వారు అర్హులు. నెలకు రూ.62,000-రూ.75,000 వరకు వేతనం అందజేస్తారు. ఇంటర్వ్యూ, దేహదారుఢ్య పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగనుంది. దరఖాస్తు రుసుము జనరల్, ఓబీసీలు రూ.300, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలి. వివరాలకు చెన్నై మెట్రోరైల్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఐపీఎల్ పోటీలతో పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మార్చి 27: ఐపీఎల్ పోటీల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగింది. రాష్ట్రంలో దినసరి విద్యుత్ వినియోగం 15,000 మెగావాట్లు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచే రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికం కావడంతో ఏసీల వినియోగం పెరిగింది. ఈ నెల 22వ తేది ఉదయం 11 గంటలకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 19,409 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ నేపథ్యంలో, తాజాగా ఐపీఎల్ పోటీలు ప్రారంభం కావడంతో ప్రజలు టీవీల్లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం చూడడం, సెల్‌ఫోన్లు ఛార్జింగ్ పెట్టి మ్యాచ్‌లు చూస్తుండడంతో, అదనంగా 100 మెగావాట్ల వరకు విద్యుత్ వినియోగం పెరిగిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

ఈజీ ఫ్రెండ్లీ మొబైల్ అప్లికేషన్‌ను పరిచయం చేసిన వీటీ మార్కెట్

అడయార్, మార్చి 27: సౌత్ ఏషియన్ మార్కెట్‌లో సులభతరమైన ట్రేడింగ్ కోసం యూజర్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫాం, మొబైల్ అప్లికేషన్‌ను గ్లోబల్ మల్టీ అసెట్స్ బ్రోకరేజ్ కంపెనీ వీటీ మార్కెట్ అందుబాటులోకి తెచ్చింది. ట్రేడింగ్ వ్యాపారం చేసే ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చేలా ఈ ప్లాట్‌ఫామ్స్‌ను రూపొందించినట్టు వీకే మార్కెట్స్ పేర్కొంది. వీటీ మార్కెట్ ద్వారా వివిధ రకాలైన వస్తువులను సులభంగా ట్రేడింగ్ చేసుకునే సదుపాయం ఉంది. వీటిలో మెటాట్రేడర్ 4, 5 ప్లాట్‌ఫారంలతో పాటు వెబ్ ట్రేడర్, వెబ్ ట్రేడర్ ప్లస్, వీటీ మార్కెట్ యాప్స్ ఉన్నాయి.

రెండు టోల్‌ప్లాజాల రుసుము పెంపు

పెరంబూర్, మార్చి 27: చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలోని బరనూరు, ఆత్తూర్ టోల్‌ప్లాజా రుసుము రూ.5 నుంచి రూ. వరకు పెరిగింది. ఈ పెంపు ఏప్రిల్ 1వ తేది నుంచి అమల్లోకి రానుందని జాతీయ రహదారుల కమిషన్ ప్రకటించింది. ఆ ప్రకారం, నెలల్లో 50 సార్లు వెళ్లేలా అందించే మాసాంతపు కార్డు రూ.45 నుంచి రూ.200 వరకు, స్థానిక, ప్రైవేటు వాహనాలకు మాసాంతర వాహన రుసుము రూ.10 వరకు పెరిగింది. అలాగే, ఒకసారి ప్రయాణం, ఒకరోజులో రెండు సార్లు ప్రయాణానికి రూ.5 నుంచి రూ.20 వరకు రుసుము పెరిగాయి.

చిన్నారుల కోసం సిప్ అకాడమీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



ఆంగ్లభాషలో ప్రతిభా పాటవాలను పెంచుకునే పద్ధతులను వివరిస్తున్న నిర్వాహకులు

అడయార్, మార్చి 27: చిన్నారుల కోసం 'క్రికో ఇంగ్లీష్' పేరుతో యునీక్ ఇంగ్లీష్ స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాంను ఎస్ఐపి (సిప్) అకాడమీ లాంచ్ చేసింది. రానున్న మూడేళ్లలో దేశవ్యాప్తంగా 250కి పైగా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థగా గుర్తింపు పొందిన సిప్... యూకేకు చెందిన ఆర్‌టీఎల్ ఇంగ్లీష్ అకాడమీతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని తెలిపారు. ఆంగ్ల భాషలో పిల్లలో నైపుణ్య అంతరాయం, విద్యా విషయాల్లో విమర్శనాత్మక ఆలోచన తగ్గించడానికి తమ శిక్షణ కేంద్రాలు దోహదపడతాయన్నారు. చిన్నపిల్లకు క్రిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టు నుంచి అద్భుతమైన ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. క్రికో ఇంగ్లీష్ బిజినెస్ హెడ్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ... యానిమేటెడ్ కంటెంట్, యాప్ ఆధారిత హోంవర్క్, క్లాస్ కోర్స్ ఇన్‌స్ట్రక్టర్ జోక్యానికి సంబంధించిన ఇంటర్‌ప్లే ప్రోగ్రామ్‌ను మార్కెట్‌లోకి తీసుకొస్తామన్నారు.

పంచాయతీ మాజీ అధ్యక్షుడి కన్నుమూత


గురుస్వామి(ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనకాపుత్తూరు పంచాయతీ బోర్డు ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన జీడీ గురుస్వామి (89) మంగళవారం కన్ను మూశారు. తెలుగు ప్రముఖుడైన ఆయన స్థానిక తెలుగు ప్రజల కోసం, పంచాయతీ బోర్డు కోసం ఎంతో కృషి చేశారని, ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలుపుతున్నట్లు 'అనకాపుత్తూరు తెలుగు అసోసియేషన్' నిర్వాహకులు డాక్టర్ కుమార్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన 'టాలెంట్'



సంచిక ఆవిష్కరణలో నిర్వాహకులు

అడయార్, మార్చి 27: స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ (ఎస్ఓడీటీ) అండ్ ఇంటలెక్ట్ ఆధ్వర్యంలో "డిజైన్ థింకింగ్ ఫర్ అకడమిక్ లీడర్స్' పేరుతో తొలి నేషనల్ కాంక్లేవ్ నగరంలో విజయవంతంగా జరిగింది. 'టాలెంట్ 2040' పేరుతో జరిగిన ఈ సదస్సులో ఏఐటీఈసీ ఛైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామన్ పాల్గొని కీలకోపన్యాసం చేశారు. ఈ సదస్సుకు మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్ట్స్, సైన్స్, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ విభాగాలకు చెందిన దాదాపు 250 మంది వరకు పాల్గొన్నారు. ఇందులో అడాప్టర్స్ ఆఫ్ డిజైన్ థింకింగ్, అకడమిక్ అండ్ స్టార్టప్ ప్రాటెర్నిటీలను గుర్తించి వాటికి 'డిజైన్ థింకింగ్ ఇంపాక్ట్ అవార్డు'లను ప్రదానం చేయాలని నిర్ణయించారు. అలాగే, విద్యార్థులను భవిష్యత్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు 'టాలెంట్ 2040'పై విపులంగా చర్చించి, విధానాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఈ సదస్సులో ఇంటలెక్ట్ సీఎండీ, స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఫౌండర్ అరుణ్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సమూహ చర్చా వేదికలను కూడా నిర్వహించారు.

33 మంది రాష్ట్ర జాలర్ల విడుదల

ముగ్గురికి జైలు

పెరంబూర్, మార్చి 27: సరిహద్దులు దాటారని అరెస్ట్ చేసిన 36 మందిలో 33 మంది విడుదలయ్యారు. రామేశ్వరం, నాగపట్టినానికి చెందిన 36 మంది జాలర్లు ఈ నెల 15, 16 తేదీల్లో చేపల వేట సాగిస్తున్న తరుణంలో, సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం వారిని అరెస్ట్ చేసి జైళ్లకు తరలించింది. రాష్ట్ర జాలర్ల అరెస్ట్ విషయంలో ప్రధానిపై ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో, అరెస్ట్ చేసిన 36 మంది జాలర్లలో 33 మంది విడుదలయ్యారు. అలాగే, సరిహద్దులు దాటి చేపల వేట సాగించారనే కారణంగా జాలరికి ఏడాది జైలు, మరో ఇద్దరికి 6 నెలల జైలుశిక్ష విధిస్తూ శ్రీలంక న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

అధిక ధరలకు ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

24 మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 27: ఐపీఎల్ టిక్కెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్న 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీఎల్ పోటీల్లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ - గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం రెండు రోజుల ముందుగా ప్రారంభమైన 10 నిమిషాల్లో విక్రయమయ్యాయి. టిక్కెట్లు లభించని అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, పలువురు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులతో, పోలీసులు స్టేడియం చుట్టుపక్కల తనిఖీలు చేపట్టి, బ్లాకులో టిక్కెట్లు విక్రయిస్తున్న 24 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2,10,112 విలువైన 83 టిక్కెట్లు, రూ.18,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

24,150 చీరల స్వాధీనం

అడయార్, మార్చి 27: జిల్లా కేంద్రమైన ఈరోడ్‌లో ఒక గోదాములో అక్రమంగా నిల్వవుంచిన 24,150 చీరలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. కోడ్ నేపథ్యంలో ఓటర్లకు నగదు బట్వాడా, ఇతర బహుమతుల సరఫరాను అడ్డుకునేందుకు ఎన్నికల బందోబస్తులో నియమగ్నమైన ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపడుతోంది. ఈ తనిఖీల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు నిల్వవుంచిన బహుమతులు భారీగా పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈరోడ్ వెస్ట్ నియోజకవర్గంలోని ఒక గిడ్డంగిలో భారీ మొత్తంలో చీరలు నిల్వచేసి వుంచినట్టు వచ్చిన సమాచారం మేరకు ఆ గోదాములో తనిఖీ చేసి, 24,150 చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కుక్కను చంపిన యువకుడి అరెస్ట్

ప్యారీస్, మార్చి 27: తిరుప్పూర్ జిల్లా అవినాశిలో మద్యం మత్తులో కుక్కను కొట్టి చంపిన దస్తగిరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంఘటన రోజు మద్యం, గంజాయి సేవించిన మత్తులో తూలుతూ అవినాశి వేలాయుధపాళయంలో వీధిలో వెళుతున్న దస్తగిరికి కుక్క ఎదురుగా వచ్చింది. దీంతో ఆగ్రహించిన అతను కుక్క కాళ్లను తాళ్లతో కట్టేసి ఇనుప రాడ్‌తో దారుణంగా కొట్టి హతమార్చారు. దీనిపై స్థానిక అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు, విచారణ అనంతరం దస్తగిరిని అరెస్ట్ చేశారు.

నాలుగు తెల్ల చిలుకల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న తెల్ల చిలుకలు

పెరంబూర్, మార్చి 27: స్థానిక విమానాశ్రయంలో మలేసియా నుంచి అక్రమంగా తరలిస్తున్న అరుదైన నాలుగు తెల్లచిలుకలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాధులు వ్యాప్తి ప్రమాదం ఉన్నందున ఈ చిలుకలను మలేసియాకు తిరిగి పంపించాలని నిర్ణయించిన అధికారులు, వాటిని తరలిస్తున్న చెన్నైకి చెందిన మహమ్మద్ రాజా, రమీజ్‌రాజాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రేపటినుంచి ప్రేమలత ప్రచారం



చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత కూటమి అభ్యర్థులకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్ జిల్లాల్లో, 30న కృష్ణగిరి, ధర్మపురం, సేలంలో, 31న కన్నియాకుమారి, విల్లుపురం, చిదంబరంలో ఆమె ప్రచారం చేయనున్నారు. అదే విధంగా ఏప్రిల్ 1న పెరంబలూరు, పుదుకోట, తిరుచ్చిలో, 2న తిరువణ్ణామలై, వేలూరు, అరక్కోణంలల్లో ప్రచార పర్యటన సాగిస్తారు. ఏప్రిల్ 3, 4 తేదీల్లో తిరువళ్లూరు, కాంచీపురం, శ్రీపెరుంబుదూరు నియోజకవర్గాల్లో, 5, 6 తేదీల్లో నగరంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాలలో ఆమె ప్రచారం చేస్తారు. 7, 8 తేదీలలో కడలూరులో, 9,10 తేదీల్లో మైలాడుదురై, తంజావూరు, తిరువారూరు నియోజకవర్గాల్లో, 11న కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలిలో, 12న రామనాథపురం, శివగంగ, దిండుగల్‌లో ప్రచారం చేస్తారు. ఏప్రిల్ 13న కరూరు, నామక్కల్, తేని నియోజకవర్గాల్లో, 14వ తేదీ నుంచి 17 వరకు మదురై, తెనకాశి, విరుదునగర్‌లో ప్రచారం చేయనున్నారు. ఏప్రిల్ 17 సాయంత్రం విరుదునగర్ బహిరంగ సభలో ఆమె పాల్గొని తన ప్రచారాన్ని ముగించనున్నారు.

తేనిలో జయలక్ష్మి నామినేషన్ దాఖలు



చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత కుమార్తె తానేనంటూ ప్రకటించుకుంటున్న జయలక్ష్మి తేని లోక్‌సభ నియోజకవర్గంలో బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల కొడైకెనాల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను కొత్త పార్టీని ప్రారంభించి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. ఎంజీఆర్, జయలలిత అభిమానులందరికీ సమైక్యపరచి ప్రచారం చేస్తానని చెప్పారు. న్యాయస్థానంలో తానే జయలలిత కుమార్తెనని రుజువు చేస్తానని తెలిపారు. ఎంజీఆర్ అమ్మా మున్నేట్ర కళగం పేరుతో పార్టీని స్థాపించి కేంద్ర ఎన్నికల సంఘంలో రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.

డీపీఐకి 'కుండ' గుర్తుకు ఈసీ నో

పెరంబూర్, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో డీపీఐ పార్టీకి 'కుండ' గుర్తు కేటాయించేందుకు ఎన్నికల సంఘం నిరాకరించింది. ఈ ఎన్నికల్లో తమకు కుండ గుర్తు కేటాయించాలని డీపీఐ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరపున డీపీఐ చిదంబరం, విల్లుపురం నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

ఎయిర్‌పోర్ట్ గోపి సేవలు ప్రశంసనీయం



గోపిని సత్కరిస్తున్న టామ్స్ నేతలు

ప్యారీస్, మార్చి 27: ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్వహణలోని చెన్నై విమానాశ్రయం ఏరోనాటికల్ శాఖలో 36 ఏళ్లుగా పనిచేస్తున్న టీఎం గోపి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఆయన్ను మీనంబాక్కంలోని ఏఏఐ క్వార్టర్స్ కమ్యూనిటీ హాలులో అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. ఏఏఈయూ సదరన్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సభకు ఆలిండియా అధ్యక్షుడు బి.భాస్కరన్, జనరల్ సెక్రటరీ దీపాక్ గందాన్ హాజరయ్యారు. విధి నిర్వహణలో మచ్చ లేకుండా పనిచేయడం ద్వారా గోపి అందరికీ ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. అనంతరం ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకుడు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షుడు నేలటూరి విజయకుమార్ మాట్లాడుతూ... పదవీ విరమణ అనంతరం కూడా గోపి సమాజానికి విస్తృతంగా తమతో కలిసి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోపి కుటుంబసభ్యులు, బంధువులు, విమానాశ్రయ ఉద్యోగులు, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని, గోపి-లక్ష్మి దంపతులను సత్కరించారు. టామ్స్ నాయకులు స్వర్ణ జయపాల్, రొడ్డా జైరాజ్, ఊటుకూరి దేవదానం, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంచీపురంలో 200 సవర్ల చోరీ

● 81వ సారి పట్టుబడిన నిందితుడు


స్వాధీనం చేసుకున్న నగదు (ఇన్‌సెట్‌లో) సతీష్‌రెడ్డి

పెరంబూర్, మార్చి 27: కాంచీపురంలో 200 సవర్ల నగలు చోరీ చేసిన కేసులో, 81వ సారి దోపిడీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. కాంచీపురం విలక్కొళి పెరుమాళ్ ఆలయంలో నగదు దుకాణం నిర్వహిస్తున్న మహావీర్ చంద్ ఇంట్లో కొద్దిరోజుల క్రితం ప్రవేశించిన ఆగంతకులు 182 సవర్ల నగలు, రూ.లక్ష నగదు చోరీ చేశారు. పోతూపోతూ అదే ప్రాంతానికి చెందిన రాజేష్ ఇంట్లో కూడా ప్రవేశించి 15 సవర్ల నగలు చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి, రెండు ఘటనల్లో నిందితుడు ఒకరేనని, అతను ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన సతీష్ రెడ్డిగా గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం పోలీసులు గాలించి ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా పుత్తూరులో తలదాచుకున్న సతీష్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలోని పలు పోలీస్‌స్టేషన్లలో 80 కేసులున్నాయని, 81వ కేసులో అతన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. 88 సవర్ల నగదు, రూ.36.10 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

సెక్స్ వర్కర్లకు ఎన్నికల అవగాహన

ఐసిఎఫ్, మార్చి 27: చెన్నై సహా వివిధ జిల్లాల్లో సెక్స్ వర్కర్లకు ఓటు హక్కు వినియోగించడంపై అవగాహన కల్పిస్తున్నారు. చెన్నై జిల్లాలో 16 శాసనసభ నియోజకవర్గాల్లో 39,01,167 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 18,17,137 మంది, మహిళలు 19,82,875 మంది, ఇతరులు 1,157 మంది, సెక్స్ వర్కర్లు 10,548 మంది ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా జిల్లా ఎన్నికల అధికారులు వివిధ చర్యలు చేపడుతున్నారు. పురుషులు, మహిళా ఓటర్లతో పాటు దివ్యాంగులు, వృద్ధులు, హిజ్రాలు, సెక్స్ వర్కర్ల జాబితాను వేర్వేరుగా రూపొందించి వారికి ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆరణి - సేత్తుపట్టు రహదారిలో వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆరణి - సేత్తుపట్టు రహదారిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. సెంజి సమీపం పెరియకరం గ్రామానికి చెందిన దంపతులు శశికుమార్, మహాలక్ష్మి బైకులో వెళుతుండగా కారు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన శశికుమార్ మృతి చెందాడు. ఇదే విధంగా మేల్‌విల్వరాయ నల్లూరు రహదారి వంతెన సమీపంలో బైకుపై వెళుతున్న రాజభగ్నేశ్వర్, వెంకటేశన్‌ను అదుపు తప్పిన వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆరణి రహదారిలో నడచి వెళుతున్న మరుత్తువంబట్టి గ్రామానికి చెందిన తులసి బైకు ఢీకొనటంతో మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం తిరువణ్ణామలై ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక ప్రాణాలు కోల్పోయింది. ఇదే విధంగా ఆరణి సేత్తుపట్టు రహదారిలో బైకు ఢీకొని బలరామన్ అనే కొయ్యల వ్యాపారి దుర్మరణం చెందారు. ట్రాఫిక్ విభాగం పోలీసులు ఈ కేసులు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

గెలిపిస్తే విరుదునగర్‌లోనే స్థిర నివాసం

● విజయ్ ప్రభాకరన్ వెల్లడి



అడయార్, మార్చి 27: విరుదునగర్ ఓటర్లు తనను లోక్‌సభ సభ్యుడిగా గెలిపిస్తే తాను ఇక్కడే ఇంటిని నిర్మించుకుని స్థిర నివాసం ఏర్పరచుకుంటానని డీఎండీకే అభ్యర్థి, దివంగత కెప్టెన్ విజయకాంత్ కుమారుడు విజయ ప్రభాకరన్ వెల్లడించారు. అన్నాడీఎంకే కూటమి తరపున డీఎండీకే అభ్యర్థిగా ఆయన విరుదునగర్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యే రాజన్ చెల్లప్పను ఆయన మదురైలోని పసుమలైలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే -డీఎండీకే కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు విరుదునగర్ ఓటర్లు పట్టం కడితే తాను విరుదునగర్‌లోనే స్థిరనివాసం ఏర్పరచుకుని అక్కడే ఉంటానని తెలిపారు. తన తండ్రి భౌతికంగా లేకపోవడం తమకు లోటేనని అయితే ఆయన పేరుప్రతిష్ఠలు మాత్రం తమకు కొండంత బలాన్ని ఇస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా తనతో పాటు అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేటినుంచి సీమాన్ ప్రచారం


చెన్నైలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్

ఐసిఎఫ్, మార్చి 27: నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులకు మద్దతుగా సీమాన్ గురువారం నుంచి ప్రచారం చేపట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ బుధవారం విడుదల చేశారు. అభ్యర్థులకు మద్దతుగా గురువారం కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ తెలియజేసింది.

కేంద్రానికి మద్దతుగా ఎన్నికల సంఘ వ్యవహారం

● తిరుమావళవన్


నామినేషన్ దాఖలు చేస్తున్న డీపీఐ అభ్యర్థి తొల్ తిరుమావళవన్

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా వ్యవహరిస్తోందని, బీజేపీయేతర పార్టీల అభ్యర్థులకు చిహ్నాలు కేటాయించడంలో ఈ వాస్తవం బయటపడిందని డీపీఐ అధినేత తొల్ తిరుమావళవన్ ఆరోపించారు. చిదంబరం నియోజకవర్గంలో పోటీకి బుధవారం ఉదయం అరియలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ కూటమి మిత్రపక్షాలు కోరుకున్న చిహ్నాలను వెనువెంటనే కేటాయిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు కలిగిన డీఎంకే మిత్రపక్షాలకు గుర్తులను ఏవేవో సాకులు చెబుతూ కేటాయించకుండా మొండి వైఖరిని అవలంబిస్తోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలను నిష్పక్షపాతంగా జరుపుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. అయినప్పటికీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన చెప్పారు.

అన్నామలై ఆస్తులు రూ.1.48 కోట్లు

పెరంబూర్, మార్చి 27: కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరపున పోటీ చేస్తున్న అన్నామలై ఆస్తుల విలువ రూ.1.48 కోట్లు అని నామినేషన్ పత్రంలో తెలియజేశారు. ఆ ప్రకారం, అన్నామలై చరాస్తులు రూ.36 లక్షలు, స్థిరాస్తుల విలువ రూ.1.12 కోట్లుగా ఉంది. అలాగే, అన్నామలై భార్య పేరుతో రూ.2.03 కోట్ల విలువైన చరాస్తులు, రూ.53 లక్షల స్థిరాస్తులున్నాయి. ఇక, అన్నామలైకు రూ.5 లక్షల విలువైన కారు ఉండగా, ఆయనపై 24 కేసులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

మీ ఇంటి ఆడపడుచుగా ఓట్లు అభ్యర్థిస్తున్నా

● దక్షిణ చెన్నై డీఎంకే అభ్యర్థి తమిళచ్చి

ప్యారీస్, మార్చి 27: మీ ఇండి ఆడపడుచుగా ఓట్లు అభ్యర్థిస్తున్న తనను గెలిపించాలంటూ దక్షిణ చెన్నై లోక్‌సభ డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్ పల్లికరనైలో బుధవారం ఉదయం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 190వ వార్డు జలడియన్‌పేట ప్రాంతంలో తమిళచ్చి తంగపాండ్యన్‌కు మద్దతుగా రాష్ట్ర మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే అరవింద్ రమేష్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. తాను ఓట్లు అభ్యర్థించేందుకు మాత్రమే రాలేదని, మీ ఇంటి ఆడపడుచుగా గత ఐదేళ్లుగా మీతోనే గడిపానని, ఈసారి కూడా ఎంపీగా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వంతో మాట్లాడి ఈ ప్రాంతంలో వాననీటి సంరక్షణ కాలువలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.

తొలిసారి ఓటేసే యువతకు టోపీలు

ప్యారీస్, మార్చి 27: తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోన్ను యువతకు టోపీ బహుమతిగా అందజేయనున్నట్లు వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత యువతదేనని, ఓటు వేయడం బాధ్యతే కాకుండా రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. మొదటిసారి ఓటేసే ఓటర్లు ఆ పోలింగ్ కేంద్రాల్లోని ఎన్నికల సిబ్బందితో సెల్ఫీ తీసుకోవచ్చని, ఈ జిల్లాలో సుమారు 30,000 మందికి పైగా మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనే వారున్నారని కలెక్టర్ తెలిపారు.

మంత్రి కేఎన్ నెహ్రూకు అస్వస్థత

ప్యారీస్, మార్చి 27: కరూర్ లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి అరుణ్ నెహ్రూకు మద్దతుగా బుధవారం ఉదయం ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ అస్వస్థతకు గురయ్యారు. ఓపెన్ టాప్ జీపులో నిలబడి ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ మంత్రి కొంత దూరం ప్రచారం చేసిన నేపథ్యంలో, తనకు ఆరోగ్యం సరిలేదంటూ పార్టీ నిర్వాహకులతో తెలిపి, వెంటనే ప్రచార వాహనం దిగి ఆయన తన కారులో ఆసుపత్రికి వెళ్లారు.

ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ


విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 27: స్థానిక ఊరీసు కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు, ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా జిల్లా యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగా ఊరీసు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, వేలూరు తహసీల్దార్ కవిత, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, మండల జాయింట్ డైరెక్టర్ (కళాశాల విద్య) ఎయిలన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆనికమల ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన మాజీ సైనికుడు

వేలూరు, మార్చి 27: వేలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థిగా కాట్పాడి తాలూకా వల్లిమలైకి చెందిన మాజీ సైనికుడు శ్రీనివాసన్ నామినేషన్ దాఖలు చేశారు. సరిహద్దు భద్రతా దళం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భారతీయ కిసాన్ జవాన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాభిరామ్ కుమారుడు శ్రీనివాసన్ బుధవారం తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సుబ్బులక్ష్మికి అందజేశారు.


వేలూరు జిల్లాలో 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా ప్రజలకు కల్పిస్తున్న అవగాహన చర్యల్లో భాగంగా సత్తవాచేరిలో గ్యాస్ సిలిండర్‌పై ఓటు హక్కు ప్రాధాన్యం తెలిపే స్టిక్కర్ అంటిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మాలతి

● వీఐపీ నియోజకవర్గం

విరుదునగర్‌లో చక్రం తిప్పేదెవరో?



ప్యారీస్, మార్చి 27: పన్నెండు సమస్యలు కొలువదీరిన విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గానికి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చక్రం తిప్పేందుకు కాంగ్రెస్, డీఎంకే, బీజేపీలు రంగంలోకి దిగాయి. డీఎంకే కూటమిలో కాంగ్రెస్ తరపున సిట్టింగ్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ మళ్లీ ఈ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. అన్నాడీఎంకే కూటమిలో భాగస్వామ్యం వహిస్తున్న డీఎండీకే అభ్యర్థిగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత సినీ నటుడు విజయకాంత్, ఆ పార్టీ అధ్యక్షురాలు ప్రేమలత దంపతుల కుమారుడు, నటుడు విజయ ప్రభాకరన్ తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

పార్లమెంటులో గళం విప్పినా ఫలితం శూన్యం ●ఎంపీ మాణిక్కం ఠాగూర్

'విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎయిమ్స్ ఆసుపత్రి, మదురై విమానాశ్రయ విస్తరణ, రైల్వే పథకాలు, అగ్గిపెట్టల పరిశ్రమ, బాణసంచా తయారీ, జౌళి పరిశ్రమకు భద్రత అనే ఐదు ప్రధాన సమస్యలున్నాయి. 2019 ఎన్నికల్లో నేను ఎంపీగా గెలిచాక పలు అభివృద్ధి పనులు పూర్తిచేశా. ఈ సమస్యలను పరిశీలించాలని పార్లమెంటు సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. 2019లో శంకుస్థాపన జరిగిన ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేలా కేంద్రం పనులు ప్రారంభించింది. 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దుబాయ్ - కొలంబో దేశాల మధ్య విమాన సేవలను ప్రారంభించింది. బాణసంచా, అగ్గిపెట్టెల పరిశ్రమల సంక్షేమార్థం ఆ వృత్తులను అంతర్జాతీయ విపణికి తీసుకెళ్లేలా తూత్తుకుడి హార్బర్ నుంచి సరుకుల రవాణా సేవలు ప్రారంభించాలని కేంద్రప్రభుత్వానికి లేఖ రాశా. తిరుప్పరంకుండ్రం రైల్వేస్టేషన్ ఆధునీకరణ, మల్లెపూల సెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు, శివకాశి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి అదనంగా కేటాయించిన నిధులతో ఆ పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. నా ఎంపీ నిధుల నుంచి విద్య, ఆరోగ్యం, తాగునీరు, గ్రామాల్లో మెరుగైన వసతులు తదితరాలకు రూ.17 కోట్లు కేటాయించా. మళ్లీ నన్ను ఎంపీగా గెలిపిస్తే మరింతగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా' అని మాణిక్కం పేర్కొన్నారు.

ఆరు శాసనసభ నియోజకవర్గాలు...

విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో తిరుప్పరంకుండ్రం, తిరుమంగళం, శివకాశి, అరుప్పుకోట, సాత్తూరు, విరుదునగర్ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ స్థానానికి 1989 నుంచి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే 3 సార్లు, సీపీఎం ఒకసారి, ఎండీఎంకే 3 సార్లు, కాంగ్రెస్ పార్టీ 2 సార్లు తమ జెండా ఎగురవేశాయి.

మొత్తం ఓటర్లు: 14,91,695, పురుషులు: 7,28,158 మహిళలు: 7,63,335, ఇతరులు: 202

నమోదైన ఓటు శాతం...

2014 ఎన్నికల్లో 74.86 శాతం
2019 ఎన్నికల్లో 72.41 శాతం

సిట్టింగ్ ఎంపీ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాణిక్కం ఠాగూర్ సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. ఆయన పార్లమెంటు సమావేశాల్లో విరుదునగర్ నియోజకవర్గంకు సంబంధించి జరిగిన చర్చల్లో 96 సార్లు పాల్గొని 317 ప్రశ్నలను సంధించారు.

ప్రధాన సమస్యలు... :
- మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి పరచకపోవడం.
- ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు ఐదేళ్లుగా ప్రారంభించక పోవడం
- ప్రకటనలకే పరిమితమైన విరుదునగర్ బస్ టెర్మినల్
- బాణసంచా ఉత్పత్తుల ఎగుమతికి విరుదునగర్, శివకాశి ప్రాంతాల్లో లారీ టెర్మినల్ నిర్మాణంలో చర్యలు తీసుకోకపోవడం
- శివకాశి రింగ్ రోడ్డు నిర్మాణపనులు జాప్యం.
- అరుప్పుకోట శాసనసభ నియోజకవర్గంలో మల్లెపూల సెంటు తయారీ కర్మాగారం, జౌళి పరిశ్రమలకు నూలు కొనుగోలు ధరలో రాయితీ కల్పించకపోవడం.
- అగ్గిపెట్టెల పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల జీవనాధారాన్ని నష్టపరుస్తున్న సిగార్ లైటర్ ఉత్పత్తి నిషేధించకపోవడం.
- విరుదునగర్ నాలుగు రోడ్ల రహదారిలో కలెక్టర్ కార్యాలయం, సాత్తూర్ పడందల్ ప్రాంతంలో సాయిల్ టెస్టు పూర్తిచేసి ఏళ్లు గడుస్తున్నా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.
- బాణసంచా,అగ్గిపెట్టెల తయారీ కార్మిక సంక్షేమ బోర్డు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం
- విరుదునగర్, శివకాశి ప్రాంతాలను పరిశ్రమల నగరంగా మార్చుచేసేందుకు ఎలాంటి పథకం రూపొందించలేదు.
- కుల్లూరుసంత డ్యాక్, కౌసికా నదులలో పూడికతీత పనులు చేపట్టని కారణంగా తాగు, సాగునీటికి ఇబ్బంది పడతున్న స్థానికులు
- బాణసంచా తయారీలో బేరియం నైట్రేట్ ఉపయోగించడం,టపాకాయలకర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తరపున రక్షణ పరికరాలు పొందుపరచడం.



మాణిక్కం ఠాగూర్ (కాంగ్రెస్), విజయ ప్రభాకరన్ (డీఎండీకే), రాధిక శరత్‌కుమార్ (బీజేపీ)

2014 ఎన్నికల ఫలితాలు...

2014 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, డీఎంకే, ఎండీఎంకే పోటీ చేశాయి. అన్నాడీఎంకే అభ్యర్థి రాధాకృష్ణన్ 4,06,694 ఓట్లు పొంది ఎంపీగా గెలిచారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో 2,61,143 ఓట్లు, డీఎంకే అభ్యర్థి రత్నవేల్ 2,41,505 ఓట్లు పొందారు.

2019 ఎన్నికల్లో...

ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన మాణిక్కం ఠాగూర్ 4,70,883 ఓట్లు రాబట్టుకొని ఎంపీగా గెలిచి తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు. డీఎండీకే అభ్యర్థి అళగర్‌స్వామికి 3,16,329 ఓట్లు, ఏఎంఎంకే అభ్యర్థి పరమశివ అయ్యప్పన్‌కు 1,07,615 ఓట్లు నమోదయ్యాయి.

● అమ్మో... అంత ఆదాయమా?!



కనిమొళి ఆస్తులు రూ.57.32 కోట్లు

● ఐదేళ్లలో 80 శాతం పెంపు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గంలో రెండోసారి పోటీ చేస్తున్న డీఎంకే మహిళా విభాగం నాయకురాలు కనిమొళి ఆస్తులు గత ఐదేళ్లలో 80 శాతం పెరిగాయి. నామినేషన్‌తోపాటు సమర్పించిన ఆస్తుల జాబితా వివరాల ప్రకారం ఆమె రూ. 57.32 కోట్ల మేరకు ఆస్తులు కలిగి ఉన్నారు. 2019లో నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన ఆస్తుల జాబితా ప్రకారం అప్పట్లో ఆమెకు రూ.30.34 కోట్ల మేరకు ఆస్తులు ఉండేవి. ఇక తాజా వివరాల ప్రకారం కనిమొళి రూ. కోటి 37లక్షల 16వేల 290ల విలువైన 3 కార్లు కలిగి ఉన్నారు. 704 గ్రాముల బంగారు, 13.03 కేరట్ వజ్రం తదితర విలువైన ఆభరణాలు కలిగి ఉన్నారు. ఆమె వద్ద నున్న నగల మొత్తం విలువ రూ.55.37 లక్షలు. ఇక నగదు, బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసిన నగదు అంటూ మొత్తం రూ.18.54 కోట్ల మేరకు స్థిరాస్తులు కలిగి ఉన్నారు. ఇక కనిమొళి భర్త అరవిందన్ పేరిట నగదు, కారు అంటూ రూ.66.21 లక్షల విలువైన చరాస్థులు ఉన్నాయి. ఇక స్థలాలు వాణిజ్యభవనం, నివాసగృహం అంటూ రూ.2.26 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అదే విధంగా రూ.60లక్షల 60వేలకు పైగా రుణం పొంది ఉన్నానని, భర్త పేరిట ఎలాంటి రుణాలు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో కనిమొళి పేర్కొన్నారు.

● సంగతేంది సామీ!



ఈపీఎస్ మౌనవ్రతం వెనుక మర్మమేమిటో?

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు మునుపే బీజేపీతో తెగతెంపులు చేసుకుని పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలకు గాను 33 నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపి సుడిగాలి ప్రచార పర్యటనలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఓ విషయమై మౌనవ్రతాన్ని పాటిస్తుండటం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యపోతున్నారు. ఆ విషయం ఏమిటంటే ప్రచార సభలలో ఆయన పాలకపక్షం డీఎంకేని చెండాడుతూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారే తప్ప బీజేపీ గురించి గాని, కనీసం ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గురించి పల్లెత్తు మాట అనడం లేదు. ఈనెల 24న డీఎంకే సభను తలదన్నేలా నిర్వహించిన భారీ బహిరంగ సభలోనూ స్టాలిన్‌ను, డీఎంకే ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఆ సభలోనూ బీజేపీ గురించి ఎలాంటి విమర్శలు చేయకుండా మిన్నకుండిపోయారు. పార్టీ శ్రేణులకే విసుగుపుట్టించేలా అన్నాడీఎంకే పాలనలో అమలు చేసిన పథకాలన్నింటినీ ఏకరువుపెట్టారు. కేంద్రంలోని బీజేపీ గురించిగానీ, ప్రధాని నరేంద్రమోదీ గురించి గానీ ప్రస్తావించక మిన్నకుండిపోయారు. ఈ వియమై పార్టీ సీనియర్ నేతలు కొందరు ప్రస్తుతం జరుగుతున్నది లోక్‌సభ ఎన్నికలనే విషయాన్నే ఈపీఎస్ పూర్తిగా మరచిపోయారని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనూ ఆయన ప్రచారం డీఎంకేపై విమర్శలు వెదజల్లే రీతిలోనే ఇప్పటివరకూ సాగిందన్నారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన సమయంలో విలేకరుల సమావేశంలో బీజేపీపై మెతక వైఖరిని అవలంబిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు వేచి చూడండి అంటూ ముక్తసరిగా సమాధానమిచ్చారు. ఈపీఎస్ ఇలా బీజేపీని విమర్శించకపోవడాన్ని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ పలు సభల్లో ప్రస్తావిస్తూ బీజేపీ, అన్నాడీఎంకే మధ్య తెరచాటు అక్రమ సంబంధం కొనసాగుతోందని, ఎన్నికలయ్యాక రెండు పార్టీలు మళ్లీ ఏకమైనా ఆశ్చర్యపోనక్కరలేదని ప్రస్తావిస్తున్నారు. స్టాలిన్ చేసిన ఈ విమర్శపై కూడా ఈపీఎస్ ఇప్పటివరకూ చిరునవ్వునే సమాధానంగా ఇస్తున్నారు.

● 'అమ్మ' సెంటిమెంట్

ప్రచార సభలను వదలని జయ సెంటిమెంట్



ప్యారీస్, మార్చి 27: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాల్గొననున్న ప్రచార సభను కూడా దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత పేరుతో 'అమ్మ గ్రౌండ్'ను ఎంపిక చేశారు. ఏప్రిల్ 10వ తేది సాయంత్రం 7 గంటలకు తిరుప్పూర్ అభ్యర్థి అరుణాచలం, నీలగిరి అభ్యర్థి లోకేష్ తమిళ్‌సెల్వన్‌లకు మద్దతుగా పళనిస్వామి ప్రచారంలో పాల్గొననున్నారు. ఇందుకోసం తిరుప్పూర్ పాండ్యన్ నగర్‌లో ఉన్న అమ్మ గ్రౌండ్‌ను వేదికగా స్థానిక పార్టీ నిర్వాహకులు ఎంపిక చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అధినేత్రి జయ ఏ పార్టీతో పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీచేసి 39 స్థానాల్లో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో తిరుప్పూర్ అభ్యర్థికి మద్దతుగా ఏర్పాటుచేసిన ప్రచారసభ ఇదే పాండ్యన్‌నగర్‌లోనే జరిగింది. అంతకు ముందు 2009 లోక్‌సభ ఎన్నికల్లో, 2011 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ప్రచార సభలో కూడా జయ పాల్గొని అత్యధిక సీట్లను కైవసం చేసుకున్నారు. ఈ సెంటిమెంట్ కారణంగా పళనిస్వామి సలహా మేరకు పార్టీ అభ్యర్థులు అమ్మ గ్రౌండ్‌ను ప్రచార సభకు ఎంపిక చేసి బ్రహ్మాండమైన వసతులతో రూపొందిస్తున్నారు.



నామినేషన్ దాఖలు సందర్భంగా ఉత్తర చెన్నై పార్లమెంటు అన్నాడీఎంకే అభ్యర్థి డాక్టర్ జయవర్ధన్‌కు పూలమాలతో సత్కారం



దక్షిణ చెన్నై పార్లమెంటు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమిళచ్చి తంగ పాండ్యన్ బుధవారం షోళింగనల్లూర్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టగా, క్రేన్ సాయంతో ఆమెకు భారీ పూల దండ సమర్పిస్తున్న కార్యకర్తలు



బుధవారం కోయంబేడులో ఎన్నికల ప్రచారం చేపట్టిన దక్షిణ చెన్నై పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమిళిసై



● ఆ మాత్రం హామీ ఇవ్వాల్సిందే!

మందుబాబుల వాహనానికి ప్రత్యేక నెంబర్ ప్లేట్

● ఇండిపెండెంట్ అభ్యర్థి నాగరాజ్



డమ్మీ కరెన్సీ నోట్ల మాల ధరించి నామినేషన్ దాఖలు చేసిన నాగరాజ్

ప్యారీస్, మార్చి 27: ప్రభుత్వానికి ఆదాయం చేకూరుస్తున్న మందుబాబుల వాహనాలకు ఎరుపు రంగులో ప్రత్యేక నెంబర్ ప్లేట్ కేటాయించాలని పార్లమెంటులో ప్రస్తావిద్దాం అని సెంట్రల్ చెన్నైలో పోటీ చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి నాగరాజ్ ఇండిపెండెంట్ అభ్యర్థులకు పిలుపునిచ్చారు. మందుబాబుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అరుంబాక్కానికి చెందిన నాగరాజ్ అవినీతిని లేకుండా చేద్దామన్న వాక్యాలతో ముద్రించిన డమ్మీ నోట్ల మాల ధరించి తన నామినేషన్ పత్రాలను షేనాయ్ నగర్‌లో ఉన్న రిటర్నింగ్ అధికారి వద్ద దాఖలుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మందుబాబుల సంఘం మద్దతుతో తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, రాష్ట్రంలో మద్యం తాగే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే మద్యానికి బానిసలైన వారి కోసం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి ఆదాయం చేకూరుస్తున్న మందుబాబులు వాహనాలు నడిపే సమయంలో పోలీసులు కేసు నమోదు చేయకుండా ఎరుపు రంగులో ప్రత్యేక నెంబర్ ప్లేట్ పథకాన్ని తీసుకురావాలని పార్లమెంటులో ప్రస్తావిస్తానని ఆయన రాష్ట్రవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థులకు పిలుపునిచ్చారు.

● కాస్త ఆలోచించి మాట్లాడొద్దూ!

చేతులెత్తమన్న మంత్రి

● సభ నుంచి బయటకు వెళ్లిన మహిళలు



మంత్రి పన్నీర్‌సెల్వం

ప్యారీస్, మార్చి 27: ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి మణి పరిచయ సభలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పన్నీర్‌సెల్వంకు చేదు అనుభవం ఎదురైంది. మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ సభలో మంత్రి పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ.. టిక్కెట్టు లేకుండా బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్న వారు, అలాగే, నెలకు రూ.1,000 ఆర్థికసాయం అందుకుంటున్న మహిళలు సిగ్గుపడకుండా చేతులెత్తాలని, అంతేకాకుండా ఈ అంశంపైనే ఇంటింటా ప్రచారం చేపట్టాలని సూచించారు. దీంతో అక్కడున్న మహిళలకు ఏమర్థమైందో ఏమో గానీ.. మంత్రిగారి మీద రుసరుసలాడుతూ అక్కడి నుంచి లేచివెళ్లిపోయారు.

● వినూత్న నిరసన

కూరగాయల మాలతో రిటర్నింగ్ అధికారి వద్దకు

● కోవైలో స్వతంత్ర అభ్యర్థి నిర్వాకం



కూరగాయలతో ఆర్వో వద్దకు వెళ్తున్న అభ్యర్థి

ప్యారీస్, మార్చి 27: కూరగాయల ధరలు విపరీతంగా పెరగడాన్ని నిరసిస్తూ కోయంబత్తూరు జిల్లా సుందరాపురానికి చెందిన నూర్ మహమ్మద్ అనే స్వతంత్ర అభ్యర్థి వినూత్నంగా నిరసన తెలిపాడు. మెడలో బెంగళూరు మిర్చి, కొన్ని కూరగాయల హారాన్ని ధరించి, బిక్షగాడి పాత్ర చేతబట్టి నామినేషన్ దాఖలు చేశాడు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే తనలా కాకుండా, అందరినీ ధనవంతుల్ని చేస్తానని ఈ సందర్భంగా మీడియా ముందు శపథం చేశాడు. ఇదిలా వుండగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వందమీటర్ల ముందే పోలీసులు అతనిని అడ్డుకున్నారు. మెడలో వున్న మిరపకాయల మాలను తొలగించి, నామినేషన్ దాఖలుకు రావాలని ఆదేశించారు. దీంతో చేసేది లేక నూర్ మహమ్మద్ పోలీసులు చెప్పినట్లు నడుచుకున్నాడు.

నామినేషన్ పత్రాలు మరిచారు

● డీఎంకే అభ్యర్థి తంగ తమిళ్‌సెల్వన్



పెరంబూర్, మార్చి 27: తేని లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగ తమిళ్‌సెల్వన్ బుధవారం నామినేషన్ దాఖలు చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట మంత్రులు ఐ.పెరియస్వామి, మూర్తి తదితరులున్నారు. కార్యాలయంలోకి వెళ్లే సమయంలో నామినేషన్ పత్రాలు మరిచిపోయినట్లు గుర్తించిన తంగ తమిళ్‌సెల్వన్, వెంటనే ఈ విషయాన్ని తన వెంట వచ్చిన పార్టీ నేతకు తెలిపారు. ఆయన వెంటనే మోటర్‌సైకిల్‌పై వెళ్లి నామినేషన్ పత్రాలు తీసుకొచ్చారు. అప్పటివరకు మంత్రులతో పాటు తంగ తమిళ్‌సెల్వన్ కార్యాలయం గేటు వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

సారీ... ఇక కాఫీలు మాత్రమే!

పెరంబూర్, మార్చి 27: విరుదునగర్ జిల్లా డీఎంకే జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించినప్పుడు ప్రతినిధులకు భోజనం అందజేయడం ఆనవాయితీ. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆదివారం పార్టీ అభ్యర్థి పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సాత్తూర్ రామచంద్రన్ మాట్లాడుతూ... ఎన్నికలయ్యే వరకు నిర్వహించే సమావేశాల్లో కార్యకర్తలకు కేసరి, కాఫీలు మాత్రమే అందిస్తామని, భోజనాలు అందిస్తే అభ్యర్థుల ఖర్చులో జమ అవుతాయని, కార్యకర్తలు ఈ విషయం గుర్తెరిగి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



● ఎన్నికల సమయం కదా!

బీజేపీ మెనూలోనూ మటన్ బిర్యానీ

పెరంబూర్, మార్చి 27: ద్రావిడ పార్టీల మోడల్‌ను బీజేపీ అనుసరిస్తోంది. డీఎంకే, అన్నాడీఎంకే ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు మటన్, చికెన్ బిర్యానీ, చికెన్ 65 తదితరాలు అందిస్తున్నాయి. దీంతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ విధానాన్నే బీజేపీ కూడా చేపట్టాలని నిర్ణయించింది. ఈ విషయమై ఆ పార్టీ సీనియర్ నేత మాట్లాడుతూ.. ప్రచారంలో కార్యకర్తలకు బిర్యానీ అందజేస్తే ఉత్సాహంగా పాల్గొంటున్నారని, అందువల్ల కార్యకర్తలకు బిర్యానీ అందజేయాలని అభ్యర్థులకు సూచించామన్నారు. వారంలో రెండు సార్లు, శని, ఆదివారాల్లో మటన్, చికెన్ బిర్యానీ, శాఖాహారులకు స్వీట్లు, పండ్లతో కూడిన భోజనం అందించాలని సూచించినట్లు ఆయన తెలిపారు.



29న 'గాడ్జిల్లా అండ్ కాంగ్' రిలీజ్



'గాడ్జిల్లా అండ్ కాంగ్' ఓ దృశ్యం

హాలీవుడ్ చిత్రాల్లో "గాడ్జిల్లా అండ్ కాంగ్" చిత్రాలకు ప్రత్యేక ఆదరణ ఉంటుంది. ఈ తరహా చిత్రాలను పిల్లలతో పాటు పెద్దలు కూడా ఆదరిస్తారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలు కాసుల వర్షం కురిపించాయి. ఈ సిరీస్‌లో వస్తున్న మరో భారీ చిత్రం 'గాడ్జిల్లా అండ్ కాంగ్ - ది ఎంపైర్' మూవీ. ఆడమ్ వింగార్డ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని లెజెండరీ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించింది. ఈ చిత్రంలో రెబెకా హాల్, బ్రియాన్ టైరీ హెన్రీ, డాన్ స్టీవెన్స్, కైలీ హాట్లీ, అలెక్స్ ఫెర్న్స్, ఫలచెన్ తదితరులు నటించారు. ఇందులో గాడ్జిల్లాకు సరికొత్త రూపాన్ని ఇవ్వడం గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'గతంలో వచ్చిన చిత్రాలకు సీక్వెల్‌గా ఈ మూవీని తెరకెక్కించాం. ఈ సినిమా టైటాన్స్ చరిత్ర, వాటి మూలాలు, స్కల్ ఐలాండ్ అంతర రహస్యాలను మరింత లోతుగా విశ్లేషించేలా ఉంటుంది. ఈనెల 29వ తేదీన తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. ప్రధాన పాత్రను పోషించిన రెబాకా హాల్ మాట్లాడుతూ... 'ఆడమ్ వింగార్డ్ దర్శకత్వంలో నటించడం నాకు ఎపుడూ సంతోషమే. ఆయన అత్యంత ప్రతిభ కలిగిన దర్శకుడు. ఆయన షూట్ చేసే ప్రతి సన్నివేశం ఎంతో క్లియర్‌గా ఉంటుంది. ఈ సినిమాను చాలా అద్భుతంగా తెరకెక్కించారు. ఇందులోని గ్రాఫిక్స్‌ను ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

నా పుట్టిల్లు రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్

● లోకేష్ కనకరాజ్ ● 'ఇనిమేల్' ఆల్బం సాంగ్ విడుదల

చిత్రజ్యోతి



విలేకరుల సమావేశంలో శ్రుతిహాసన్, లోకేష్ కనకరాజ్

తనకు రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పుట్టినిల్లువంటిదని యువ దర్శకుడు లోకేష్ కనకరాజ్ అన్నారు. హీరోయిన్ శ్రుతిహాసన్‌తో కలిసి ఆయన నటించిన 'ఇనిమేల్' ఇండిపెండెంట్ ఆల్బమ్ సాంగ్‌ను నగరంలో తాజాగా రిలీజ్ చేశారు. ఈ పాటకు విశ్వనటుడు కమలహాసన్ సాహిత్యం అందించగా, శ్రుతిహాసన్ సంగీత స్వరాలు సమకూర్చారు. ఇందులో శ్రుతిహాసన్, లోకేష్ కనకరాజ్ మధ్య సన్నిహిత సన్నివేశాలు ఉండటం ఆశ్చర్యపరిచింది. 'యాక్షన్ డైరెక్టర్ రొమాన్స్ హీరో'గా మారిపోయారంటూ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో సాంగ్‌ను విడుదల చేసిన తర్వాత లోకేష్ కనకరాజ్ విలేకరులతో మాట్లాడుతూ... 'కెమెరా ముందు నటించాలన్న కోరిక నాకు లేశమాత్రం కూడా లేదు. కానీ, ఈ ఆల్బమ్ సాంగ్‌లో నటించాలని శ్రుతి కోరడంతో ఆశ్చర్యపోయా. ఆ తర్వాత ఆల్బమ్ యూనిట్ సభ్యుల సహకారంతో సులభంగా నటించాను. చిత్రపరిశ్రమలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో నేను అధికంగా మాట్లాడిన వ్యక్తి కమల హాసన్ మాత్రమే. అందుకే ఆయన సొంత నిర్మాణ సంస్థ నాకు ఒక పుట్టినిల్లు వంటింది' అన్నారు. హీరోయిన్ శ్రుతిహాసన్ మాట్లాడుతూ.. 'జీవితంలో గాఢంగా ప్రేమించిన ఒక వ్యక్తితో ఉన్న అనుబంధం, జీవితం, ప్రేమలో వైఫల్యం, వీటన్నింటినీ నాలుగు నిమిషాల వీడియో సాంగ్‌లో చెప్పాలనుకున్నా. ముందు ఈ సాంగ్‌ను నా పియానో మీద ఇంగ్లీష్‌లో రాసుకున్నా. ప్రస్తుత జనరేషన్ మనస్తత్వాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించా. నా ఉద్దేశంలో ప్రేమ ఒక మాయాలోకం. చక్కెర ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినా షుగర్ క్యాండీలను ఇష్టంగా తింటాం. ప్రేమ కూడా అంతే. లోకేష్ కనకరాజ్ నటుడిగా కనిపిస్తారు. పెద్ద దర్శకుడైనా అణకువగా ఉండే వ్యక్తి. ఆయనతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. దర్శకత్వంలో తను ఎంత క్రియేటివ్‌గా ఉంటాడో తెలుసు. కానీ, ఇంత బాగా నటిస్తాడని అనుకోలేదు. తొమ్మిది వేర్వేరు లోకేషన్లలో చిత్రీకరించాం. ఈ సాంగ్ కోసం నాన్న పది రకాల లిరిక్స్ ఇచ్చారు. నాన్నతో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తా' అన్నారు.